APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 31 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :96 పేజీలు : 04 వెల: 2-00/-

## ఏపీలో ప్రభుత్వం అనేది ఉందా?'



ఒకవైపు రాష్ట్రంలో వర్షాలు పడటం లేదని, కరువు నెలకొందని, మరొకవైపు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు.

'రాష్ట్రంలో వర్షాలు పడటం లేదు.. కరువు నెలకొంది, రోజుకు 10 సార్లు కరెంట్‌పోతుంది.

విశాఖపట్నం: ఏపీలో ఎక్కడ చూసినా అనిశ్చితి పరిస్థితే కనిపిస్తోందని, అసలు రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా? అని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ. ఒకవైపు రాష్ట్రంలో వర్షాలు పడటం మిగతా..2లో

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్



కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్

రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి

సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా

అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత

కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. మిగతా..2లో

## రాయలసీమ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్




- రాయలసీమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్ పెట్టారు.
- రాయలసీమలో పల్లె సీమల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు.

అమరావతి, ఆగస్టు 30 : రాయలసీమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. రాయలసీమలో పల్లె సీమల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. రూ. 8,022 కోట్లతో గ్రామాలు, అటవీ అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌ను రూపొందించారు. రూ. 4,523 కోట్లతో 23,000కు పైగా రోడ్ల పనులు జరగనున్నాయి. ఇప్పటికే 5,238 కిలోమీటర్ల మేర బీటీ,

## మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

# వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం

- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం
- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు



అమరావతి : మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును మిగతా..2లో

## విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి.. ఏఐజీకి శంకుస్థాపన చేయనున్న లోకేశ్

- విశాఖలో కొలువుదీరనున్న ఏఐజీ ఆసుపత్రి
- సోమవారం శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్
- రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 9,000 మందికి ఉపాధి
- వెయ్యి పడకలతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు




అమరావతి : ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగం మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రి ఇప్పుడు విశాఖపట్నంలో తన శాఖను ఏర్పాటు చేయనుంది. ప్రజాప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో, ఈ ప్రపంచ స్థాయి వైద్య సంస్థ రాక ఆరోగ్య రంగానికి మరింత బలాన్ని చేకూర్చనుంది. నగరంలోని ఎండాడ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, రాష్ట్ర ప్రజలు ఇకపై అత్యున్నత వైద్యం కోసం

## నేపాల్‌లో విరిగిపడిన భారీ మంచు కొండ




- గిరాంగ్ పోర్ట్‌ను పూర్తిగా తుడిచిపెట్టిన ప్రవాహం
- గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన వరద
- నదిలో పడటంతో 300 అడుగుల ఎత్తున ఎగిసిపడిన అలలు
- శాస్త్రవేత్తల నివేదికలో వెల్లడైన విపత్తు వివరాలు

## ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

# ఆ ఒక్క చోట మాత్రం పోస్ట్ పోన్

- సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరు
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించిన పరీక్ష
- 2 కేంద్రాల్లో నిలిచిన పరీక్ష- అభ్యర్థుల ఆందోళన




ఢిల్లీ : నీట్ పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్ బీఈఎంఎస్ ) సంస్థ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. అయితే, రాజస్థాన్ లోని జైపుర్ లో 2 పరీక్ష కేంద్రాల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్ బీఈఎంఎస్ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీ టెస్ట్ ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డులతో సహా తదుపరి వివరాలు మిగతా..2లో

## భారత్- ఉజ్బెకిస్థాన్ ట్రేడ్ డీల్- యురేనియం సరఫరా,

# యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు

- భారత్- ఉజ్బెకిస్థాన్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యం
- భారత్‌కు యురేనియం సరఫరా, ఉజ్బెకిస్థాన్‌లో యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు
- ప్రధాని మోదీ ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్



ఢిల్లీ : మధ్య ఆసియాలో కీలక దేశమైన ఉజ్బెకిస్థాన్‌తో భారత్ తన వ్యూహాత్మక బంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రధాని నరేంద్ర మోదీ 2 రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్‌తో ఆదివారం తాష్కెంట్‌లో ఉన్నత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాల్ని 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం'గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఇరువురు నేతలు సంయుక్తంగా ప్రకటించారు. ప్రస్తుతం భారత్- ఉజ్బెకిస్థాన్ మిగతా..2లో

## రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నాం




- వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడి

ఢిల్లీ : రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను చేపట్టారు. ఈ అభివృద్ధి పనులను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచనలు చేశారు. రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకం : ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు

## మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

# అసెంబ్లీ మొదలయ్యేలోపు మార్పులు చేర్పులు!

- రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు
- మంత్రుల శాఖలను మార్చే పనిలో సీఎం, పీసీసీ వర్గాలు
- సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో కాంగ్రెస్



ఢిల్లీ : రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా? అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యేలోపే మంత్రి మండలి విస్తరణ, ప్రక్షాళనకు సీఎం సిద్ధమవుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గడిచిన నాలుగైదు రోజులుగా రేవంత్ రెడ్డి తన జట్టులో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలు, సామాజిక సమీకరణాలను ఇందుకు ప్రాతిపదికగా తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది. మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకునే విషయంలో కొనసాగుతున్న జాప్యం, సీడబ్ల్యూసీ సమావేశం సమయంలో సీఎం రేవంత్ రెడ్డి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా భేటీ కావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా సీఎం కసరత్తు చేస్తుండడం లాంటి తాజా రాజకీయ పరిణామాలను చూస్తే మంత్రివర్గ విస్తరణతో పాటు ప్రక్షాళన ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. దాదాపు మంత్రుల అందరి శాఖలను మార్చే పనిలో సీఎం ఉన్నట్లు పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. మిగతా..2లో

## నగరం నడిబొడ్డున కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం'.. సీఎం రేవంత్‌కు హరీశ్ లేఖ



- కాంగ్రెస్ సర్కార్ వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను ప్రైవేటు పరం చేయడానికి కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు.
- ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తాము పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

హైదరాబాద్, ఆగస్టు 30: నగరం నడిబొడ్డున మరో భారీ భూ కుంభకోణానికి కాంగ్రెస్ సర్కార్ తెరలేపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్, అజామాబాద్‌లో తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రేవంత్ సర్కార్ రూ.87 కోట్లకే ప్రైవేటు పరం చేయడానికి కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. నగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆయన లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే తాము పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..
# రేపు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం

ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# రాయలసీమ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్

సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి పవన్ కల్యాణ్ చేపట్టిన జల సంరక్షణ చర్యలతో రాయలసీమ సస్యశ్యామలం కానుంది. ఉపాధి హామీ ద్వారా 62 వేల ఎకరాల్లో ఉద్యాన సాగు చేపట్టారు. దీని ద్వారా 28 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. నీటి కుంటలు, ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి చెందనున్నాయి. 50 వేలకు పైగా ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. పాడి రైతులకు అండగా గోకులాలు, నీటి తొట్టెలను నిర్మించారు. సీమ దాహార్తి తీర్చేందుకు జేజేఎం-అమరజీవి జలధారాలు సిద్ధమవుతున్నాయి. 13 నగర వనాలతో పట్టణాల్లో పచ్చదనం పెంపొందనుంది.చేసిన విషయం తెలిసిందే. పవన్ కల్యాణ్ చేపట్టిన జల సంరక్షణ చర్యలతో రాయలసీమ సస్యశ్యామలం కానుంది. ఉపాధి హామీ ద్వారా 62 వేల ఎకరాల్లో ఉద్యాన సాగు చేపట్టారు. దీని ద్వారా 28 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. నీటి కుంటలు, ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి చెందనున్నాయి. 50 వేలకు పైగా ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. పాడి రైతులకు అండగా గోకులాలు, నీటి తొట్టెలను నిర్మించారు. సీమ దాహార్తి తీర్చేందుకు జేజేఎం-అమరజీవి జలధారాలు సిద్ధమవుతున్నాయి. 13 నగర వనాలతో పట్టణాల్లో పచ్చదనం పెంపొందనుంది.

# ఏపీలో ప్రభుత్వం అనేది ఉందా?'

లేదని, కరువు నెలకొందని, మరొకవైపు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. ప్రస్తుతం మధ్యతరగతి ప్రజల పరిస్థితి చాలా దుర్భరంగా ఉన్నా, కూటమి పాలకులు చీమ కుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(ఆదివారం) విశాఖపట్నం నుంచి మీడియాతో మాట్లాడిన బొత్స.. రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం ఉంటే, కూటమి ప్రభుత్వం మాత్రం వ్యక్తిగత ఆరోపణలతోనే కాలక్షేపం చేస్తుందని ధ్వజమెత్తారు. 'రాష్ట్రంలో వర్షాలు పడటం లేదు.. కరువు నెలకొంది, రోజుకు 10 సార్లు కరెంట్‌పోతుంది. విద్యుత్ సమస్యపై ప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదు. డీఎస్సీలో పరీక్షలు రాయకుండానే ఉద్యోగాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ ఉద్యోగాలు అమ్ముకుంది. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి. జీవోలు ఇవ్వడం.. రద్దు చేయడం ఏంటి?, గ్యాస్ రూ. 937.. మధ్య తరగతి ప్రజలు ఎలా బ్రతకాలి?, అన్నపూర్ణ లాంటి ఏపీలో కిలో బియ్యం రూ. 70 ఉందిరాష్ట్రంలో చంద్రబాబులా అందరూ డబ్బులొన్న వాళ్లు ఉండరు. ధరలు పెరిగినట్లు తలసరి ఆదాయం పెరుగుతుందా?, పంచదార కేజీ రూ. 75 ఎలా కొనాలి?, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగితే ప్రజలు ఎలా బతకాలి. రాష్ట్రంలో క్రైం పెరిగింది. హత్యలు, అత్యాచారాలు, గంజాయి ఇవే రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో వర్షాలు పడటం లేదు, కరువు నెలకొంది. పబ్లిక్ మీటింగ్‌ల్లో చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. టైం పాస్ చేయడానికి చంద్రబాబు అరకు రావాలా?, అసలు రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా?' అని ప్రశ్నించారు బొత్స.

# నేపాల్‌లో విరిగిపడిన భారీ మంచు కొండ

ఢిల్లీ : నేపాల్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో ఊహించని రీతిలో పెను విపత్తు సంభవించడం తెలిసిందే. ఆ జలప్రళయం 700కి పైగా ప్రాణాలను బలిగొంది. సహాయక చర్యలు కొనసాగేకొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది. భారీ మంచు దిబ్బ (గ్లేసియర్) కుప్పకూలడంతో ఏర్పడిన ప్రచండమైన ప్రవాహం ఓ ప్రాంతాన్ని పూర్తిగా తుడిచిపెట్టేసింది. గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఈ మంచు, రాళ్ల వరద సృష్టించిన బీభత్సం వివరాలను శాస్త్రవేత్తలు తమ నివేదికలో వెల్లడించారు. వారి కథనం ప్రకారం, లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వత శ్రేణిలో సుమారు 16,700 అడుగుల ఎత్తు నుంచి ఓ భారీ మంచు శిఖరం విరిగిపడింది. దాదాపు 1.5 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ మంచు పర్వతం, భారీగా రాళ్లు, మట్టి సహా సమీపంలోని నదిలో కుప్పకూలింది. దీంతో నదిలో సుమారు 300 అడుగుల ఎత్తున ఓ రాకాసి అల ఏర్పడింది. ఈ భీకర ప్రవాహం అసాధారణ వేగంతో పర్వత లోయల గుండా ప్రయాణించింది. గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఈ మంచు, బురద, రాళ్ల మిశ్రమ ప్రవాహం ధాటికి దాని మార్గంలోని గిరాంగ్ పోర్ట్ అనే ప్రాంతం పూర్తిగా జలసమాధి అయింది. క్షణాల్లోనే ఈ ప్రాంతం రూపురేఖలు లేకుండా సర్వనాశనమైందని శాస్త్రవేత్తలు వివరించారు. హిమాలయాల్లో వాతావరణ మార్పుల కారణంగా ఇలాంటి విపత్తులు సంభవిస్తున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భారత్- ఉజ్బెకిస్థాన్ ట్రేడ్ డీల్- యురేనియం సరఫరా,
# యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు

మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1 బిలియన్ డాలర్లుగా ఉండగా, దీనిని 2030 నాటికి ఏకంగా 5 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. మైనింగ్, పర్యటకం, సంస్కృతి, విద్య, ఆయుర్వేదం తదితర కీలక రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇరు దేశాలు 11 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రక్షణ రంగంలో కూడా సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఇక్కడ ఉజ్బెకిస్థాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా (లాంగ్ టర్మ్ సప్లై) యురేనియం సరఫరా చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు దేశాలు అంగీకరించాయి. డిజిటల్ చెల్లింపుల రంగంలో కూడా భారత్‌కు కీలక పురోగతి లభించింది. ఇక్కడ భారత్‌కు చెందిన ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్, ఉజ్బెకిస్థాన్‌కు చెందిన నేషనల్ ఇంటర్‌బ్యాంక్ ప్రాసెసింగ్ సెంటర్ జేఎస్‌సీ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని ద్వారా భారతీయ యూపీఐ యాప్స్‌ను ఉపయోగించే వారు ఉజ్బెకిస్థాన్‌లోని ఖ్యు= నేషనల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వ్యాపార చెల్లింపులు చేసే అవకాశం ఏర్పడుతుంది.

# రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నాం

ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం క్యాంటీన్, ఎస్కలేటర్, 2 లిఫ్టులు, దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందని వివరించారు. ఈ సంవత్సరం చివరి నాటికి వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునికీకరణ పనులు పూర్తైన తరువాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆగ్రహం : చేవెళ్లలో హైదరాబాద్ బీజాపూర్ రహదారి రోడ్డు పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రోడ్డు పనుల్లో ఆలస్యం ఎందుకు జరుగుతుందని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు వంకర టింకర్లు ఉండడంతో భూసేకరణ సమయంలో పరిశీలించలేదా అని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు మలుపులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా హెచ్చుగా ఉండటంతో ఒకవైపు సర్వీస్ రావడం, మరోవైపు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు తడబడడంతో హైదరాబాద్ బీజాపూర్ రోజువారి పనుల విషయంలో సమీక్షా సమావేశం నిర్వహించి రైతులు, స్థానికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కాల యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు మనీషా అనంత్ రెడ్డి, శైలజా రెడ్డి తదితరులు ఉన్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..
# అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్



"కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

# నగరం నడిబొడ్డున కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం'.. సీఎం రేవంత్‌కు హరీశ్ లేఖ

మొదటి పేజి తరువాయి

దశాబ్దాలుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్తులను కమీషన్ల కోసం పాలకులు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. 'ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన రేవంత్ సర్కార్.. రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయింది. రూ.500 కోట్ల విలువ చేసే ఆయిల్‌ఫెడ్ భూములను కేవలం రూ.87 కోట్లకు ప్రైవేటు పరం చేయడానికి సిద్ధమైంది' అని హరీశ్ లేఖలో రాసుకొచ్చారు. ఆ సొమ్మును చెల్లించేందుకు ఆయిల్‌ఫెడ్ సిద్ధంగానే ఉందని, అయినా వారిని కాదని ప్రైవేటు వ్యక్తులకై భూములను ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు ఉత్సాహం చూపిస్తోందని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ప్రైవేట్ శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తిని చిత్తశుద్ధితో కాపాడామని,



ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. పేదల పొట్టగొట్టి పెద్దలకు పల్లీలు, బఠాణీల్లా వేల కోట్ల రూపాయల భూములు పంచుతోందని ఘాటు విమర్శలు చేశారు. 1987లో సుప్రీంకోర్టు ప్రైవేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా.. కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలోకి తొక్కారని ధ్వజమెత్తారు. ఒకవైపు సామాన్యుల ఇళ్లను 22ఏ జాబితాలో పెట్టి వేధిస్తున్న ప్రభుత్వం.. మరోవైపు ఖరీదైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం కారుచౌకగా ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తోందని ఫైరయ్యారు. ఇలా స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే భవిష్యత్తులో గుడికి, బడికి, చివరికి శ్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని మండిపడ్డారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దుచేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని హరీశ్‌రావు సూచించారు. ప్రజల సొత్తును ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు మహా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి.. ఏఐజీకి శంకుస్థాపన చేయనున్న లోకేశ్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుంది.

### భారీ పెట్టుబడి, ఉపాధి అవకాశాలు

విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుకుంటుంది. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ద్వారా రోజుకు 5,000 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన తర్వాత సుమారు 1000 మంది డాక్టర్లు ఇక్కడ సేవలు అందించనున్నారు.

### ప్రాజెక్టు స్వరూపం, నిర్మాణ ప్రణాళిక

విశాఖలోని ఎండాడలో మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి క్యాంపస్‌ను, మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనలతో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఒకేచోట ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో చేపట్టి, 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లోని ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మాతా శిశు విభాగం కూడా ఉంటుంది.

### పరిశోధన, శిక్షణకు పెద్దపీట

వైద్య సేవలతో పాటు విద్య, పరిశోధనలకు ఏఐజీ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నర్సింగ్ కళాశాల, సిబ్బందికి హాస్టల్, పారామెడిక్ సిబ్బందికి శిక్షణా కేంద్రం, 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం. విజిటింగ్ ఫ్యాకల్టీ, వైద్యుల కోసం వసతితో పాటు రోగుల



సహాయకుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారు. వైద్య రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఏఐజీ, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ఎండోస్కోపీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి రాకతో విశాఖ హెల్త్‌కేర్ హబ్‌గా మారడమే కాకుండా, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్ - అసెంబ్లీ మొదలయ్యేలోపు మార్పులు చేర్పులు!

మొదటి పేజి తరువాయి

ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తయిన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించేందుకు కొందరు మంత్రులు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు తెలుస్తోంది. అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ : ప్రస్తుత కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం మంత్రివర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండగా, ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తే మరో రెండు స్థానాలు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. దీంతో మొత్తం మూడు నుంచి నాలుగు బెర్తులు అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త వారికి అవకాశం కల్పించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జిల్లాల వారికి ఈసారి అవకాశం : ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ఈసారి అవకాశం కల్పించే



విషయం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రి పదవిపై ఆసక్తి చూపుతుండడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో కేబినెట్‌లోకి తీసుకుని, స్పీకర్ పదవిని మరో నేతకు అప్పగిస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా సీఎం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఏఐసీసీ స్థాయిలో రాజగోపాల్ రెడ్డి పేరు ప్రతిపాదనకు వస్తే సమీకరణాలు మారే అవకాశం ఉందంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఎన్నికలకు వెళతామని సీఎం పదే పదే చెబుతున్నారు. దీంతో ఆయనకు మంత్రి మండలిలో స్థానం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ పేరును పరిశీలించే అవకాశం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. గవర్నర్ కోటాలో 3 స్థానాలు ఖాళీ : ఈ ఏడాది నవంబర్ గవర్నర్ కోటాలో 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఈరవత్రి అనిల్‌ను ముందుగానే కేబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా సీఎం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది. స్పీకర్ ప్రసాద్ కుమార్ ను మంత్రి మండలిలోకి తీసుకునేట్లు అయితే స్పీకర్ కుర్చీ ఖాళీ కానుంది. ఆ స్థానాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌కు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే కేబినెట్ విస్తరణతో పాటు స్పీకర్ మార్పు, మంత్రుల శాఖల మార్పు, ఒకరిద్దరు మంత్రుల తొలగింపు, కొత్త వారికి అవకాశం ఇలా భారీ స్థాయిలో మార్పులు చేర్పులకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష- ఆ ఒక్క చోట మాత్రం పోస్ట్ పోన్

మొదటి పేజి తరువాయి




విడిగా తెలియజేస్తామని ప్రకటించాయి. రీ షెడ్యూల్ చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు 300 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. తమిళనాడు, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు నగరాల్లోని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉన్నత వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడం కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు.

### రాజస్థాన్ లో పరీక్షకు విద్యుత్ అంతరాయం

సాంకేతిక సమస్యల కారణంగా పరీక్షకు అంతరాయం కలిగిందని ఆరోపిస్తూ, సీతాపురలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. "నేను పరీక్ష రాయడానికి ఇక్కడికి వచ్చాను. పరీక్ష మొదలవ్వకముందే సిస్టమ్ పదేపదే ఆగిపోతూ వచ్చింది. రెండు నిమిషాలు పనిచేసి, ఆ తర్వాత ఆగిపోయింది. ఇలా కనీసం 20 సార్లు జరిగింది. కొద్ది సేపటికి పనిచేస్తుందేమోనని అనుకున్నాం. కానీ అది పనిచేయలేదు" అని విష్ణు శర్మ అనే అభ్యర్థి ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్ద భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నప్పుడు, దేశంలోనే అతిపెద్ద పరీక్షల్లో ఒకటైన దీనికి సరైన సదుపాయాలను కల్పించలేరా? అని అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహించడానికి ఎవరూ సిద్ధంగా లేరని, పరీక్షను కేవలం తమ కేంద్రంలోనే మళ్లీ నిర్వహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని రద్దు చేసి దేశవ్యాప్తంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### 'విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం'

మరోవైపు, ఈ ఘటనపై పోలీసు అధికారి లలిత్ శర్మ స్పందించారు. "సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడం వల్లే పరీక్ష సజావుగా సాగలేదని తెలుస్తోంది. కొందరి కంప్యూటర్లు పనిచేయగా మరికొందరివి పనిచేయకపోవడంతో పరీక్షకు అంతరాయం కలిగింది. పరీక్ష, నిర్వహణ తీరుపై విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుతం వారితో చర్చిస్తూ, నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ విషయం గురించి పరీక్ష నిర్వహణ సంస్థతో ఉన్నతాధికార స్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నాయి" అని తెలిపారు.

### నీట్ యూజీ పేపర్ లీక్ వివాదం

ఇదిలా ఉండగా, 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్ టీఏ) మే 3న పెన్-అండ్-పేపర్ విధానంలో నిర్వహించిన నీట్ యూజీ 2026, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేశారు. అనంతరం, జూన్ 21న రీ టెస్ట్ నిర్వహించారు. అయితే పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఫలితంగా కొంత మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించారు. పరీక్షల్లో సంస్కరణలు తీసుకొస్తామని ప్రభుత్వం పేర్కొంది. పేపర్ లీక్ లో బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది.

# ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించకపోవడం విచారకరం

### సుప్రీంకోర్టులో జడ్జీల నియామకాలపై న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కీలక వ్యాఖ్యలు- ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సూచన

ఢిల్లీ : సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రముఖ న్యాయకోవిదులను నియమించాలనే వాదనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆదివారం బలపరిచారు. ఇలా చేయడం వల్ల ప్రతిభావంతులతో సుప్రీంకోర్టు ధర్మాసనం వైవిధ్యభరితంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే ప్రముఖ న్యాయకోవిదులు న్యాయ నిర్ణయ ప్రక్రియలో పాలుపంచుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (3)(సీ) ప్రకారం ఇటువంటి నియామకానికి వీలున్నప్పటికీ, గత 76 ఏళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు లేదా ప్రాక్టీసింగ్ న్యాయవాదులు తప్ప మరెవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాకపోవడం విచారకరమని అన్నారు. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో జస్టిస్ భూయాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

### రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది అదే!

"సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా న్యాయకోవిదుడిని (న్యాయశాస్త్ర నిపుణుడు) నియమించడానికి మన రాజ్యాంగంలో అవకాశం ఉన్నప్పటికీ, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళ్లు దాటినా ఇప్పటివరకు అటువంటి నియామకం జరగలేదు. ఒక విశిష్ట న్యాయకోవిదుడు కోర్టుకు గొప్ప విలువను తీసుకురాగలరు. తన



పాండిత్యంతో, అత్యున్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో గణనీయమైన కృషి చేయగలరు. ప్రముఖ న్యాయకోవిదులు, న్యాయ పండితుల భాగస్వామ్యం సుప్రీంకోర్టు పనితీరుపై కీలక ప్రభావాన్ని చూపుతుంది. అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీలుగా న్యాయశాస్త్ర నిపుణులు ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. అయితే కేంద్ర ప్రభుత్వం లేదా కొలీజియం ఈ అంశాన్ని ఇప్పటివరకు పరిశీలించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక కావడానికి అవసరమైన లోతైన పరిజ్ఞానం భారతీయ న్యాయకోవిదులకు లేదని వారు భావిస్తున్నారు."

### జస్టిస్ ఉజ్జల్ భూయాన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి
### అదే ఆనవాయితీగా వస్తోంది : జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాధారణంగా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు జడ్జీగా నియమించడం ఆనవాయితీగా వస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో బార్ అసోసియేషన్ నుంచి నేరుగా నియామకాలు జరిగాయని, ఆ నియమకాలు అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయని గుర్తు చేసుకున్నారు. అయినప్పటికీ న్యాయకోవిదులు ఎవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ న్యాయకోవిదులు సుప్రీంకోర్టులో భాగమై ఉంటే గణనీయమైన కృషి చేయగలిగే అద్భుతమైన మేధావులు న్యాయ రంగంలో ఉండేవారని అభిప్రాయపడ్డారు. "సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయ నిర్ణయాధికార సంస్థ మాత్రమే కాదు. అది దేశానికి నైతిక, చట్టపరమైన, రాజ్యాంగపరమైన అంతరాత్మ సంరక్షకురాలు. సుప్రీంకోర్టు సాంకేతిక అంశాలకు అతీతమైనది. ప్రతిభావంతులైన న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని వైవిధ్యభరితంగా మార్చడానికే విశిష్ట న్యాయవేత్త అనే నిబంధనను ఏర్పాటు చేశారు. ఒక వ్యక్తిని విశిష్ట న్యాయవేత్తగా గుర్తించడానికి, అతను కోర్టు ముందు న్యాయవాద వృత్తిని చేపట్టాల్సిన అవసరం లేదు. లాయర్లు, జడ్జీలను న్యాయకోవిదులుగా వర్గీకరించగలిగినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(3) ప్రకారం ఈ పదాన్ని ఆ రెండు వర్గాలకు మించి విస్తరించాలి. చట్టంలో నైపుణ్యం ఉన్న లేదా చట్ట రంగంలో పరిజ్ఞానం ఉన్న వ్యక్తిని న్యాయకోవిదుడిగా పిలవడానికి అర్హత ఉంటుంది. ఫెడరల్ కోర్టు న్యాయమూర్తిగా నామినేట్ కావడానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం కనీసం అధికారిక న్యాయశాస్త్ర డిగ్రీ కూడా అవసరం లేదు. న్యాయ పండితులకు ఆచరణాత్మక అనుభవం కొరవడిందన్న వాదనను అవాస్తవం. అమెరికా, బ్రిటన్, కెనడా, కెన్యా వంటి పలు దేశాల్లో ప్రముఖ న్యాయకోవిదులు రాజ్యాంగ న్యాయస్థానాల జడ్జీలుగా నియమితులవుతున్నారు" అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు.

యూనివర్సిటీల గురించి కీలక వ్యాఖ్యలు

ప్రశ్నించే, స్వేచ్ఛగా ఆలోచించే సంస్కృతి విద్యార్థులకు విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లోనే ప్రారంభం కావాలని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం ఒక తరం నుంచి మరొక తరానికి జ్ఞానాన్ని అందించేవిగా మాత్రమే ఉండకూడదని అభిప్రాయపడ్డారు. అవి విద్యార్థులకు స్వతంత్రంగా ఆలోచించడానికి, ప్రశ్నించడానికి సహాయపడాలని తెలిపారు. స్వేచ్ఛను, భిన్నత్వాలను నిజంగా గౌరవించే ప్రజాస్వామ్యాన్ని సమాజం కోరుకుంటే దానికి పునాది విశ్వవిద్యాలయాల్లోనే వేయాలని పేర్కొన్నారు.

# కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం నగరంలోని 2 డివిజన్ బిందెలకాలనీలో 3, 4 సచివాలయాల పరిధిలోని యువజన విభాగం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలను ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారని తెలిపారు. వైఎస్ జగన్ కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు అందిస్తామని మాయమాటలు చెప్పారని.. ఇప్పుడు జగన్ అందిస్తున్న పథకాలను కూడా తీసేశారన్నారు. రెండేళ్లుగా కూటమి నేతలు ప్రచార ఆర్భాటానికే పరిమితం అవుతున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఆడ బిడ్డ నిధి వంటి పథకాలను సూపర్ సిక్స్‌లో పెట్టి 25 నెలలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. గతంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేవని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు వినీత్, స్థానిక వైసీపీ నేతలు రాజశేఖరరెడ్డి, బిందెల నాగేంద్ర, రామకృష్ణారెడ్డి, రమణ, లోకేష్, చిరంజీవి, లోకేష్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

# దేశ ప్రధాని.. మన్ కీ బాత్ కార్యక్రమం
## వీక్షించిన బీజేపీ నాయకులు

అనంతపురం క్రైం ప్రతినిధి, ఆగస్టు 30 అనంత సూర్య : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత' కార్యక్రమాన్ని నగరంలోని పృథ్వీ నివాసంలో ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. దేశ ప్రగతి, ప్రజా సంక్షేమం, నూతన భారత నిర్మాణం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని అందరం కలిసి ఆలకించామని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర సెల్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిరణ్ గౌడ్, మండల అధ్యక్షులు సంగాల ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షులు పామిశెట్టి నాగరాజు, అయ్యన్న, రాజేంద్ర, అయ్యప్ప నాగరాజు, వంకదారి నాగరాజు, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, పవన్, బుడగ జంగాల నాగరాజు, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# అమృతమూర్తి పల్లె ఉమాకు ఘన నివాళులు





అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య : పేదల జీవితాల్లో వెలుగులు నింపిన అమృతమూర్తి, సేవామూర్తి, దివంగత పల్లె ఉమా 8వ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలోని పల్లె ఉమా ఘాట్ వద్ద జరిగిన వర్ధంతి కార్యక్రమం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, మనుమడు వియాన్, మనుమరాలు వన్షా, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి తదితర కుటుంబ సభ్యులు పల్లె ఉమా ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించి అశ్రు నివాళులు అర్పించారు.

వెనుకబడిన రాయలసీమ విద్యాభివృద్ధికి విశేష కృషి : పల్లె ఉమా కేవలం ఒక వ్యక్తి కాదని.. ఒక వ్యవస్థ అని కుటుంబ సభ్యులు, అభిమానులు కొనియాడారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలవడంతో పాటు అనేక కుటుంబాలకు ఆపన్నహస్తం అందించిన ఆమె సేవలు ఎప్పటికీ మరవలేనివన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన దైవస్వరూపురాలిగా పల్లె ఉమా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆమె అందించిన ఆత్మీయత, అభిమానం, ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ప్రజలే దేవుళ్లుగా భావించే పల్లె కుటుంబం ప్రజలే దేవుళ్లుగా భావించే పల్లె కుటుంబం సేవా సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎలాంటి పదవిలో లేకపోయినా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్నారని అన్నారు. కులం, మతం, వర్గం, వర్ణం అనే తేడాలు లేకుండా ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయ సహకారాలు అందించడం పల్లె కుటుంబానికి అనవాయితీగా వస్తోందన్నారు. పల్లె ఉమా చూపిన సేవా మార్గాన్ని కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు.

భారీగా తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు : పల్లె ఉమాకు నివాళులు అర్పించేందుకు పుట్టపర్తి నియోజకవర్గం నుంచే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్ధసారథి, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటప్రసాద్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర మాంసపు ఉత్పత్తుల కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్ నాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు శ్రీనివాసమూర్తి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లా పల్లవి, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బీజేపీ నాయకులు చిరంజీవి రెడ్డి, హరికృష్ణ, సురేంద్ర, జ్యోతి ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆదినారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, అబ్దుల్లా తదితరులు హాజరై నివాళులు అర్పించారు. టీడీపీ, బీజేపీ, జనసేనతో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు, పల్లె ఉమా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం, సేవా కార్యక్రమాలు : పల్లె ఉమా వర్ధంతి సందర్భంగా పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం, అన్నదానం, నిత్యవసర సరుకులు, దుస్తుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు అన్నవితరణ చేశారు. పేదలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులను అందజేశారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, మనుమడు వియాన్, మనుమరాలు వన్షా, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, సౌభాగ్యరాణి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి పేదలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు.

పల్లె ఉమా సేవలు చిరస్మరణీయం : పల్లె ఉమా భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె చేసిన సేవలు, చూపిన ఆత్మీయత, పేదల పట్ల ఆమెకున్న మానవత్వం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి,పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి వేలాది మంది పల్లె అభిమానులు, కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు, పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తగ్గించాలి



అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య : ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తగ్గించాలని, సంక్షేమ హాస్టల్లో మెస్ కాస్మోటిక్ చర్చులు పెంచాలని, డిగ్రీ కళాశాలలో తరగతులు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవనంలో ఎస్ఎఫ్ జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, మాజీ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, దానికి ప్రత్యేక నిదర్శనం అమ్మ ఒడి పేరుతో ప్రతి విద్యార్థి 2 వేల రూపాయలు ప్రభుత్వం ఖాతాలో జమ చేసుకొని ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ విద్య అభివృద్ధికి డబ్బులు కేటాయించుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో జిల్లాలో ఏక ఉపాధ్యాయ పేరుతో పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. ఇప్పటికే పాఠశాలల్లో నాణ్యమైన భోజనం లేక ఇప్పటికే వందలాది మంది విద్యార్థులు ప్రధానమైన పట్టణ కేంద్రాలలో రోడ్డుపైకి వస్తున్నారన్నారు. అదేవిధంగా సంక్షేమ హాస్టల్స్‌లో 52కు పైగా బీసీ హాస్టల్స్ 50కి పైగా ఎస్సీ హాస్టల్స్ జిల్లాలో ఉన్నాయని, సంక్షేమ హాస్టల్స్ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అరకొర వసతులతో అద్దె భవనాలలో శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో సంక్షేమ హాస్టల్స్ జిల్లాలో చాలా సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు తాగడానికి మినరల్ వాటర్ లేవని, విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్, ఇతర మౌలిక కరువైపోయాయన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా ప్రతి విద్యార్థులకు నెలకు 3 వేల రూపాయలు మెస్ బిల్లులు ప్రభుత్వం అందజేయాలన్నారు. అదేవిధంగా సంక్షేమ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, వాచ్మెన్ పోస్టులను భర్తీ చేయాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ప్రతి రెండు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రాష్ట్రంలో మూడు నెలలు పూర్తి అయిపోయినా.. ఇప్పటివరకు ఉన్నత విద్యలో డిగ్రీ విద్యార్థులకు ఇప్పటివరకు తరగతులు ప్రారంభించకపోవడమంటే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ విద్య పట్ల, ఉన్నత విద్య పట్ల ఎంత శ్రద్ధ ఉందో మనందరం కూడా అర్థం చేసుకోవాలన్నారు. తక్షణమే డిగ్రీ విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని, మైనర్, మేజర్ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో జిల్లా ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసి పోరాటానికి సిద్ధం అవుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, జిల్లా ఉపాధ్యక్షుడు బంగి శివ, భీమేష్, వెంకటేష్, సూర్యప్రకాష్, నవీన్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ రషీ, రజిత, జిల్లా కమిటీ సభ్యులు వంశీ, శివ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోజు గుంతల రోడ్లలో నడిచాం... ఈరోజు నూతన రోడ్లు తీసుకొచ్చాం







అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుంతల రోడ్లమీద నడిచామని ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే చోట నూతన రోడ్లు వేసి చూపిస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆదివారం ఆమె ఆత్మకూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా వడ్డుపల్లి సమీపంలోని... 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద 25 మంది రైతులకు 25కే.వి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను పంపిణీ చేశారు. ఎన్నో రోజులుగా ట్రాన్స్ఫార్మర్ల కోసం ఎదురుచూస్తున్నామని.. ఇప్పుడు అవి రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే సునీతకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అక్కడే పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భంగా టిడిపి నాయకులు అభిమానులు తెచ్చిన కట్ చేశారు. ఆ తర్వాత నూతన రోడ్ల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రం నుంచి బి.యాలేరు మీదుగా కూడేరు మండల సరిహద్దు వరకు రూ.3కోట్ల పి.ఆర్.ఆర్ – ప్లైన్ నిధులతో, 6కిలోమీటర్లు తారురోడ్డు, ఆత్మకూరు మండలకేంద్రంనుంచి, కళ్యాణదుర్గం నియోజకవర్గం, నుసి కొట్టాల గ్రామ సరిహద్దు వరకు 1.10 కోట్ల పి.ఆర్.ఆర్, ప్లైన్ నిధులతో, 2 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణం కోసం భూమి పూజలు చేశారు. అలాగే ఆత్మకూరు మండల కేంద్రంలోని ఓ.సి కాలనీలో, 65లక్షలు, బీసీ కాలనీలో 35లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సి.సి.రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఒక పండుగ వాతావరణంలో ఈ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు జరిగాయి. ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రన్న అనే రైతుకు చెందిన గొర్రెలు విషపునీళ్లు తాగి చనిపోగా...ఎన్ఆర్ఐ ప్రభాకర్ 20వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఆత్మకూరు మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల రవి 68వ జయంతి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అక్కడ కేక్ కట్ చేసి.. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రవి జయంతి సందర్భంగా చిరు వ్యాపారులకు 20తోపుడు బండ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పరిటాల రవీంద్ర జయంతి కార్యక్రమాన్ని ఆత్మకూరు మండలంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నిర్వహించారని వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. ఇంత మంచి రోజున అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం కూడా సంతోషంగా ఉందని అన్నారు. కక్కలపల్లి టమోటా మండీల నిర్వాహకులు రాప్తాడు నియోజకవర్గంలోని 6మండలాలలో ఉన్న చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం కల్పించే ఆలోచనతో ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. 18లక్షల రూపాయలు విలువైన, 120 తోపుడు బండ్లను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోయపాటి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఆత్మకూరు మండలంలో ప్రజలు నన్ను ఆదరించి మంచి మెజారిటీతో గెలిపించారని అందుకే.. గతంలో ఎప్పుడు లేని విధంగా ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు అసలు రోడ్డే లేని గ్రామాలకు కొత్త రోడ్లు తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్ర చేసినప్పుడు గుంతలు పడ్డ రోడ్లమీద వెళ్లామని.. ఇప్పుడు ఆస్థానంలో కొత్త రోడ్లు కనిపిస్తున్నాయన్నారు. ఈ రెండేళ్లలోనే ఆత్మకూరు మండలంలో 60 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఇంకా చేయాల్సిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయని.. ఎమ్మెల్యే సునీత అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు ఎదుర్కొని నిలిచారని అలాంటి వారిని నేను ఎప్పటికీ మరువలేనని అన్నారు. చాలామంది కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని త్వరలోనే అవి మంజూరవుతాయని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

# సీఎం చంద్రబాబును కలిసిన జశ్వంత్ వ్యాస్



అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య : గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం కుమార్తె, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడు వివాహ వేడుకకు హాజరవడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును హెలిప్యాడ్ వద్ద మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యువజన అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# ఘనంగా పరిటాల రవీంద్ర 68వ జయంతి వేడుకలు



అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య : పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భంగా అనంతపురం రూరల్ కక్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఘనంగా పరిటాల రవీంద్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు రాయల్ మాట్లాడుతూ.. పరిటాల రవన్న సమయంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు ఏ సమస్యనైనా తీసుకెళ్లినా.. సొంత కుటుంబ సభ్యుల్లాగా వారి సమస్యలను వినడమే కాకుండా పరిష్కారం చూపేవారన్నారు. ధనికా, పేద అనే తారతమ్యం లేకుండా అందరిని తన కుటుంబ సభ్యుల్లాగా చూసుకున్న మహోన్నత వ్యక్తి అన్నారు. మన మధ్య లేదన్న విషయం నేటికీ తాము జీర్ణించుకోలేదన్నారు. ఆయన సతీమణి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ, కుమారులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్‌లు ఆయన ఆశయాలను కొనసాగిస్తూ.. నియోజకవర్గంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటికీ ఎప్పటికీ తాము పరిటాల కుటుంబంతోనే ఉండడమే కాకుండా ఎప్పటికీ నిలిచి ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి శంకర, టిడిపి సీనియర్ నాయకుడు రాజు రాయల్, జూటూరు మధు, వలి, ప్రకాష్ బిజెపి కాలనీ పరమేష్ ఆచారి, రాము నాయక్, మల్లికార్జునయ్య, ప్రజాశక్తి నగర్ పూజారప్ప అలియాస్ కొండన్న, పేపర్ వెంకటేష్, మనోహర్, ఇందిరమ్మ కాలనీ మహబూబ్ బాషా, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనంత చరిత్ర సృష్టించిన చేయూత

**కేవలం 4 గంటల్లోనే 125 మందికి కృత్రిమ చేతుల అమరిక**

**నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతూ.. రోటరీ క్లబ్, ఐఆర్‌సీఎస్ అద్భుత సేవలు**



**అనంతపురం జిల్లా మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. కేవలం ఒక సేవా కార్యక్రమంగా ప్రారంభమై, అసంఖ్యాక నిరుపేదల జీవితాల్లో నూతన ఉత్సాహాన్ని నింపిన 'చేయూత' మహా యజ్ఞం దిగ్విజయంగా జరిగింది. ఇది కేవలం కొందరికి కృత్రిమ చేతులు అమర్చిన సాధారణ దినం కాదు.. అంధకారంలో ఉన్న 125 కుటుంబాలకు ఆశల దీపాలను వెలిగించిన చారిత్రాత్మక ఘట్టం. ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాల వల్ల చేతులు కోల్పోయి, దైనందిన జీవితాన్ని గడపలేక, జీవనోపాధి కరువై ఇబ్బంది పడుతున్న ఎంతో మందికి ఈ కార్యక్రమం ఒక గొప్ప భరోసానిచ్చింది.**

అనంతపురం,
ఆగస్టు 30 అనంత సూర్య :

రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమంలో ఎలాంటి జాప్యం లేకుండా, అత్యంత వేగంగా, నిపుణుల పర్యవేక్షణలో కేవలం 4 గంటల వ్యవధిలోనే దాదాపు 125 మంది పేదలు, నిరుపేద అంగ వైకల్యం ఉన్నవారికి అత్యాధునిక కృత్రిమ మెకానికల్ చేతులను విజయవంతంగా అమర్చారు. ఈ అపూర్వ దృశ్యాలను చూసి లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఆనంద భాష్పాలు రాల్చారు. తమ కుటుంబానికి కోల్పోయిన జీవనోపాధిని తిరిగి పొందేందుకు ఈ కృత్రిమ చేతులు ఎంతగానో ఉపయోగ పడతాయని వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకులు, కన్వీనర్ అనిల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. భావోద్వే గానికి గురయ్యారు. "ఇది నాకు కేవలం ఒక సామాజిక కార్యక్రమంలా కాకుండా, నా జీవితంలో అత్యంత సంతృప్తిని చ్చిన ఒక మహా యజ్ఞంలా కనిపిస్తోంది. చేతులు లేక చిన్న చిన్న అవసరాలకూ ఇతరులపై ఆధారపడే దుస్థితి నుంచి విముక్తి కల్పించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడమే ప్రధాన ఉద్దేశం. ఈ 125 మంది జీవితాల్లో వెలుగులు నింపడం ద్వారా సంస్థ లక్ష్యం




నెరవేరినట్లయింది.

ఈ బృహత్తర కార్య క్రమం విజయవంతం కావడానికి అహర్నిశలు శ్రమించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి, వైద్య బృందాలకు, దాతలకు, ప్రతి ఒక్క కార్యకర్తకు నా ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు. అనంతపురం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగ్గ ఈ సేవ కార్యక్రమం భవిష్యత్తులో మరిన్ని జీవితాలకు స్ఫూర్తి దాయకం కావాలని, ఇలాంటి మహోన్నత కార్యక్రమాలు మరెన్నో జరగాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.










# పరిటాల రవీంద్ర ఒక చరిత్ర

## ఆయన ఆశయాలు కొనసాగిస్తాం



అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య : మాజీ మంత్రి, టీడీపీ నేత పరిటాల రవీంద్ర ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారని... ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరిటాల రవీంద్ర 68వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. రామగిరి మండలం వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద పెద్ద ఎత్తున జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ తమ కుటుంబ సభ్యులతో కలసి పరిటాల ఘాట్ వద్ద నివాళు లర్పించారు. అనంతరం వందలాదిగా తరలివచ్చిన అభిమానులు ఘాట్ వద్ద నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి రవి ఘాట్ కు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పరిటాల సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ పరిటాల రవి అంటే ఒక పేరు కాదని అది ఒక చరిత్ర అని అన్నారు. అందుకే ఆయన మరణించి ఇన్నేళ్లు గడిచిన ప్రజలు అదే అభిమానాన్ని చూపిస్తున్నారన్నారు. ఒకప్పుడు అనేక పోరాటాలతో పేదల పక్షాన నిలిచిన పరిటాల రవీంద్ర..మంత్రి అయ్యాక ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. అయితే పేరూరు జలాశయానికి శాశ్వతంగా నీరు అందించాలన్నది ఆయన లక్ష్యమని అది త్వరలోనే నెరవేరుస్తామని పరిటాల సునీత అన్నారు రవి ఆశయ సాధన కోసం శ్రీరామ్ ప్రతినిత్యం పనిచేస్తారని ఆమె స్పష్టం చేశారు. పరిటాల రవికి రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం ప్రాంతాలంటే చాలా ఇష్టమని.. ఆయనపై చూపిన ప్రేమే నేటికీ మాపై చూపిస్తున్నారని శ్రీరామ్ అన్నారు. ప్రజలు, అభిమానులు పెట్టుకున్న నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా.. పనిచేస్తామని తెలిపారు.











# అనంతలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

*అనంతపురం, ఆగస్టు 30 అనంత సూర్య :*

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలో పర్యటించారు. నగరంలోని శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌కు మధ్యాహ్నం 2:59 గంటలకు చేరుకుని.. అక్కడ జరిగిన మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తెకు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడుల వివాహ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భం గా నూతన వధూవరులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీర్వదించి.. వారికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన వధూవరులు, గుంతకల్లు ఎమ్మెల్యే, ఆర్టీసీ జోనల్ చైర్మన్ కుటుంబ సభ్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రూప్ ఫోటో దిగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి శుభాకాంక్షలు తెలిపి బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ నుంచి మధ్యాహ్నం 3:10 గంటలకు బయలుదేరి నగరంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, గుంతకల్లు, అనంతపురం ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.






















Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405